క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన శ్రావణ్‌కుమార్ గతంలో సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోయిన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు బుధవారం బాధితుడికి అప్పగించారు. సీఐ సతీశ్‌కుమార్ ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

రెబ్బెన: మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావును కలిశారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణకు నియోజకవర్గ ప్రజలు మద్దతుగా నిలిచారని, ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 26,940 ఓట్ల మెజార్టీ వచ్చిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు ఇమ్రాజ్‌అలీ, రాజేంద్రప్రసాద్, అశోక్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తిర్యాణి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 7న ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేముల మల్లేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని బూర్గుడ గ్రామంలో ఈనెల 9వ తేదీన నిర్వహించే అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాలని బుధవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వాహణ కమిటీ ప్రతినిధులు ఆహ్వానం అందించారు. నాయకులు శ్రీని వాస్, ధర్మయ్య, ఆనంద్‌రావ్, అనిల్ పాల్గొన్నారు.

'బడిబాట' విజయవంతం చేయాలి

కెరమెరి: నేటి నుంచి 19 వరకు కొనసాగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో కుడ్మెత సుధాకర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రతీరోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి ర్యాలీ, సమావేశం, ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. బడీడు గల పిల్లలను చేర్చుకోవాలని, అంగన్‌వాడీల ద్వారా 5 సంవత్సరాలు నిండిన విద్యార్థుల జాబితా సేకరించి నమోదు చేయాలన్నారు.

కాలనీల పరిశుభ్రతకు కృషి

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలం సమీపిస్తున్నందున జిల్లా కేంద్రంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు బుధవారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావ్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సాయిబాబా ఆలయం రహదారి పక్కన ఉన్న మురికి కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. పలు కాలనీల్లో పేరుకుపోయిన డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావా లని సూచించారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

కెరమెరి: ప్రభుత్వం విధించిన గడువులోగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని చొపన్‌గూడ, కర్బెతగూడ, చింతకర్ర, కెస్లాగూడ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా బడుల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఇంకా మరుగుదొడ్లు, తాగునీటి పనులు మిగిలి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. పాఠశాలలు పునః ప్రారంభంలోపు వంద శాతం పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీలు

లింగాపూర్: మండల కేంద్రంలో బుధవారం ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు లైసెన్స్,హెల్మెట్ వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వాంకిడి: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనగా ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన వాంకిడి మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బంబార గ్రామానికి చెందిన శంకర్, మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడు తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సన్నాల సాగుకే రైతుల మొగ్గు!

- వానాకాలం నుంచి పెరుగనున్న విస్తీర్ణం
- క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్న ప్రభుత్వం
- సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు



నంబాల శివారులో సాగవుతున్న వరి పొలం (ఫైల్)

రెబ్బెన: త్వరలో ప్రారంభం కానున్న వానాకాలం పంటల సాగులో మండలంలోని వరి రైతులు సన్నాల సాగుకే ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు వానాకాలం సీజన్‌లో దాదాపు 80 శాతం సన్నాలు, 20 శాతం దొడ్డు రకం వరిని సాగు చేశారు. యాసంగిలో మాత్రం దాదాపు 70 శాతం మంది రైతులు దొడ్డు రకం సాగు చేస్తుండగా మిగిలిన రైతులు వివిధ కారణాలతో సన్నాలు సాగు చేస్తున్నారు. ఈసారి వానాకాలంలో రైతులంతా సన్నాల సాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సీజన్ నుంచి సన్నాలకు బోనస్ ప్రకటించడంతోపాటు దొడ్డు రకం వరి ధాన్యం అమ్మకాల్లో ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతులు సన్నాలవైపే అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

వానాకాలంలో 6200 ఎకరాల్లో సాగు

మండలంలోని రైతులు వానాకాలంలో సుమారు 6200 ఎకరాల వరకు వరిని సాగు చేస్తున్నారు. ప్రధాన సాగునీటి వనరు వట్టివాగు ప్రాజెక్టు కాలువ నిర్వహణ సరిగా లేకపోవడంతో ఆయకట్టు కింద వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. అందుబాటులో ఉన్న బోరుమోటర్లు, కుంటలు, వాగులపై ఆధారపడి సాగునీటిని పంటలకు అందిస్తున్నారు. అయితే గతంతో పోల్చితే ఈసారి సాగు పరిస్థితి మారేలా కనిపిస్తోంది. వానాకాలం సీజన్‌లో పంటలకు సంవృద్ధిగా సాగునీరు అందే అవకాశం ఉండటంతో రైతులు సన్నాల సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. యాసంగిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలకు సరిగా నీరు అందక తప్ప, తాలు పెరిగే అవకాశం ఉండటంతో దొడ్డురకం వరి సాగు చేస్తున్నారు.

దొడ్డురకం విక్రయానికి తిప్పలు

సన్నరకం వరి ధాన్యానికి ప్రైవేటు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది. దానికీ తోడూ దొడ్డురకం వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. తేమ, తప్ప, తాలు పేరుతో మిల్లర్లు కోతలు విధిస్తున్నారు. కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన గోనె సంచులు, లారీలు అందుబాటులో లేక ధాన్యం అకాల వర్షాలకు తడిచి ముద్దవుతున్న సందర్భాలు అనేకం ఉంటున్నాయి. అదే సన్నరకం ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో ప్రైవేట్ వ్యక్తులే నేరుగా రైతుల కల్లాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500ల బోనస్ అమలు చేస్తామని ప్రకటించడంతో వానాకాలం సీజన్‌లో సన్నాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

బోనస్‌తో రైతులకు ఊరట

రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం నుంచి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించడంతో రైతులకు కాస్త ఊరట లభించనుంది. ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ. 2203 చెల్లిస్తుండగా ప్రభుత్వం చెల్లిస్తామన్నా బోనస్‌తో వానాకాలం సీజన్ నుంచి క్వింటాల్‌కు రూ. 2703 ధర లభించనుంది.

కాస్త ఊరట



దొడ్డురకం వరిసాగుతో పోల్చితే సన్నరకం సాగులో దిగుబడి కాస్త తక్కువగా ఉంటుంది. దానికి తోడూ తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది. పెట్టుబడి ఖర్చులు కూడ ఎక్కువే. రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సీజన్ నుంచి సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించడం హర్షనీయం.

– పెసరు వెంకటమ్మ, మహిళా రైతు, రెబ్బెన

గిట్టుబాటు ధర కల్పించాలి



వరిసాగులో పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ప్రభుత్వం మద్దతుధర మాత్రం పెంచడం లేదు. అరకొరగా మద్దతు ధర పెంచుతుంది. రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా క్వింటాల్‌కు రూ.3వేలు చెల్లించాలి.

– మిట్ట దేవేందర్, ఇందిరానగర్

సాగు విస్తీర్ణం పెరుగుతుంది



సాధారణంగా వానాకాలంలో అధిక శాతం సన్నరకం వరినే సాగు చేస్తారు. కొందరు దొడ్డురకం సాగు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన నేపథ్యంలో సన్నరకం వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దాంతో ఈసారి సన్నరకం వరిసాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– మంజుల, మండల వ్యవసాయాధికారి

గాలి వీస్తే కరెంట్ కట్



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం
- రోడ్డెక్కిన 'గిరి' గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాలకు నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 2న కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి నేటికి నాలుగు రోజులు గడుస్తున్నా మండలంలోని గిరిజన గ్రామాలు అంధకారంలోనే మగ్గుతున్నాయి. సంబంధిత అధికారులకు విషయం తెలియజేసినా పట్టించుకోవడం లేదని 15 గిరిజన గూడేల గ్రామస్తులు బుధవారం మండలంలోని వట్టివాగు (చిర్రకుంట) రోడ్డుపై బైఠాయించారు. గత నాలుగు రోజుల నుంచి చీకటి, ఉక్కపోతతో నానా తంటాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా సరిగా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి వర్షం, గాలి వచ్చిన కరెంట్ కట్ అవుతుందని వాపోతున్నారు. కరెంట్ సమాచారం నిమిత్తం అధికారులకు ఫోన్‌లు చేస్తే స్విచాఫ్‌లో ఉంటున్నాయని ఆరోపించారు.

చినుకు పడితే చీకటే..

మండలంలోని పాడిబండ సెక్టర్‌లో 10 గ్రామాలకు ఈ నెల 2న వర్షం కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కాని అధికారులు నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సరఫరాను పునరుద్ధరించలేదు. విరిగిన స్తంభాలను సరి చేయకపోవడంతో కరెంట్ సరఫరా కాక నానా తిప్పలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

పలు గ్రామల్లో కరెంట్ కష్టాలు..

మండలంలోని బూర్గుడ సబ్‌స్టేషన్ పరిధిలోని పాడిబండ, వట్టివాగు, దంపూర్, డోర్లి, యాపలపాటి, దంతన్ పల్లి, దనమైన పేట, మకుల గూడ, చంపగూడ బీసీ కాలనీలో గత నాలుగు రోజుల నుంచి కరెంట్ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఆసిఫాబాద్ జన్కాపూర్ సబ్‌స్టేషన్‌పై సుమారు 35 గ్రామాలు ఉండటంతో సబ్‌స్టేషన్ నుంచి 30కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామాలు మోవాడ్, తిర్యాన్‌మోవాడ్, బలంపూర్, మాలన్‌గొంది ఖాప్రి, బెల్గాం, వావుదాం, టీమ్రాన్ మోవాడ్, గుండిగూడ, మెట్‌పల్లి, వెంకటపూర్, పార్వతినగర్, మాలన్‌గొంది, షెకన్‌గొంది, గొందుగూడ వంటి గ్రామాల్లో లైన్‌లో ఏ ఒక్క గ్రామంలో విద్యుత్ సమస్య ఉన్న మిగితా గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

నాలుగు రోజులుగా చీకటిలోనే..



మా ఊరికి నాలుగు రోజుల నుంచి కరెంట్ లేదు. చీకటిలోనే ఉంటున్నాం. చిన్న పిల్లలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సార్లు మాకు కరెంట్ వచ్చేలా చూడాలి.

– సుజాత, పాడిబండ

ఇబ్బందులు పడుతున్నాం



గాలి, వర్షం వస్తే కరెంట్ కట్ చేస్తున్నారు. రాత్రి పూట కరెంట్ లేక చీకటిలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి పూట బయటకు వెళ్లాలంటే విషపురుగులతో భయాందోళన చెందుతున్నాం.

– లక్ష్మి, వట్టివాగు

నిత్యావసర సరుకులు అందజేత

సాక్షి ఎఫెక్ట్..

కౌటాల: మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన ముగ్గురు అనాధ పిల్లలకు బుధవారం కౌటాల సీఐ సాధిక్‌పాషా, ఎస్సై మధుకర్‌తో కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. క్వింటాల్ బియ్యం, పప్పులు, వంట నూనె, ఇతర సామగ్రితో పాటు దాతలు అందించిన రూ.40 వేల నగదు అందజేశారు. చిన్నతనంలోనే పిల్లలు తల్లిదండ్రులను కోల్పోవడం చాలా బాధకరమన్నారు. 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు' కథనానికి దాతలు స్పందించి నగదు పంపించారని, మరి కొందరు నిత్యవసర సరుకులు అందించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



సరుకులు అందజేస్తున్న ఎస్సై మధుకర్

గోలేటిలో బీజేపీ విజయోత్సవం



రెబ్బెన: గోలేటిలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



తిర్యాణి: సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించటంతో బుధవారం రాత్రి గోలేటిలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ అత్యధిక మెజార్టీతో గెలవటంతో పాటు రాష్ట్రంలో 8 మంది ఎంపీ అభ్యర్థులను ప్రజలు గెలిపించారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, నాయకులు ఓదెలు, మల్లేశ్, రాజేశ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు

తిర్యాణి: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి బీజేపీ గెలుపొందడంతో ఆ పార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని కుము రం భీం చౌరస్తా వద్ద టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. దేశంలో మూడోసారి ఏన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం హర్షనీయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, ఎంపీటీసీ సార రమేశ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, సుభాశ్, తులసీరాం, తిరుపతి ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

తిర్యాణి: వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను హరితహారంలో భాగంగా నాటేందుకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మండలంలో నిర్వహించిన ఉపాధి పనులను పరిశీలించడానికి త్వరలో కేంద్ర బృందం సభ్యులు రానున్న నేపథ్యంలో రికార్డులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఏపీవో షాకీర్ ఉస్మాని, వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వేముల మల్లేశ్

'బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం'

బెజ్జూర్: బాధిత కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని బెజ్జూర్ ఆదివాసీ నాయకులు అన్నారు. మండలంలోని కోర్తేగూడ గ్రామం వద్ద గత నెల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అర్కగూడ గ్రామానికి చెందిన మహే శ్ కుటుంబానికి బుధవారం రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. బారెగూడ గ్రామానికి చెందిన తోరెం వెంగలరావ్ కుటుంబానికి రూ.15వేలతో పాటు వారి కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యానికి పాటుపడాలి



తిర్యాణి: కన్నెపెల్లి సెక్షన్ పరిధిలో మొక్క నాటుతున్న ఫారెస్టు అధికారులు

తిర్యాణి: పర్యావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తిర్యాణి రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కన్నెపెల్లి సెక్షన్ శివారులో రోడ్డు ఇరుపక్కలా మొక్కలు నాటారు. ఏపీవో షాకీర్ ఉస్మాని, ఎఫ్ ఎస్‌వోలు మహేందర్, కొప్పుల రవి, శ్రీనివాస్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

రెబ్బెన: పర్యావరణ సమతుల్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఖైరిగూడ ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ అన్నారు. బుధవారం ఖైరిగూడ ఓసీపీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సులు నిర్వహించారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవా లని సూచించారు. ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, సంక్షేమ అధికారి వేణు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో బుధవారం ఎంపీడీవో రాజేందర్ మొక్కలు నాటారు. మానవాళి మనుగడలో మొక్కలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అటవీశాఖ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ డీఎఫ్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమై పలు వీధుల గుండా కొనసాగింది. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్‌డీవో అప్పలకొండ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎఫ్‌ఆర్‌వోలు రమాదేవి, పూర్ణచందర్, దయాకర్, సుధాకర్, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని ముకదంగూడ, ప రంధోళి, ఆగర్‌వాడ, గోండ్‌గూడ, ఇందాపూర్, నిసా ని గ్రామాల్లోని చెరువుల వద్ద 'అమృత్ సరోవర్' కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా గుంతలు తవ్వి మొక్కలు నాటారు. వర్క్ సైట్ బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో అంజద్‌పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏ మహేందర్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఎఫ్ఏ పుండలిక్ తదితరులు ఉన్నారు.



రెబ్బెన: పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కెరమెరి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కాగజ్‌నగర్‌రూరల్: మొక్క నాటి నీరు పోస్తున్న ఎఫ్‌డీవో అప్పలకొండ



పెంచికల్‌పేట్: ఒడ్డుగూడలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రాజేందర్

జైనూర్: పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీశాఖ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం జైనూర్, సిర్పూర్(యూ) మండల కేంద్రాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అధికారుల తనిఖీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఫర్టిలైజర్స్ షాపులు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలను బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు కలిసి తనిఖీ చేశారు. ఏడీఏ మనోహర్, పట్టణ సీఐ శంకరయ్యలు మాట్లాడుతూ అమాయ క రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలు, నకి లీ పురుగుల మందులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులను సరఫరా చేయకూడదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న అధికారులు, సీఐ